ప్రజాశక్తి

మంగళవారం 3 జనవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం | అనకాపల్లి





షిప్‌యార్డుకు.. భారీ నౌక నిర్మాణాల ఆర్డర్ ?



హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ ముఖద్వారం

- మార్చిలోగా రూ.25 వేల కోట్ల ఎఫ్‌ఎస్‌ఎస్‌లకు అనుమతులు
- మరో 12 ఏళ్ల వరకూ హెచ్‌ఎస్‌ఎల్ మనుగడకు ఢోకాలేనట్టే

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)లో పదేళ్లుగా నలుగుతున్న ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్)ల ఆర్డర్ల వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారు రూ.25 వేల కోట్ల విలువ చేసే ఫ్లీట్ సపోర్టు షిప్‌ల ఆర్డర్లు తుదిదశలో ఉన్నట్లు తెలుస్తోంది. కేబినెట్ కమిటీ ఆన్ షిప్‌యార్డ్స్ (సిసిఎస్) చర్చల్లో తాజాగా ఈ ఆర్డర్ల విషయం తుది దశకు చేరిందని సమాచారం. తాజా వ్యవహారాన్ని ఈ ఏడాదిలో నిజంగా హిందుస్థాన్ షిప్‌యార్డుకు మహర్దశను తెచ్చిపెట్టే విషయంగానే షిప్‌యార్డు ఉద్యోగులు, అధికారులు భావిస్తున్నారు. ఫిబ్రవరి - మార్చిలో పూర్తిస్థాయిలో ఈ ఆర్డర్‌లను నౌకా నిర్మాణ సంస్థ దక్కించుకునే వీలున్నట్లు స్పష్టమవుతోంది.

నౌకల నిర్మాణం, రిపేర్లలో వైజాగ్ షిప్‌యార్డుకు ప్రపంచ స్థాయిలో పేరెన్నికగల సంస్థగా గుర్తింపు ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వమే అంటే 1941 జూన్ 21న షిప్‌యార్డుకు శంకుస్థాపన జరిగింది. దేశంలోనే తొలి నౌకా నిర్మాణ కేంద్రమిది. 1961లో పూర్తిస్థాయిలో దీన్ని కేంద్రం హిందుస్థాన్ షిప్‌యార్డు అనుబంధ పరిశ్రమగా గుర్తించింది. 2010లో రక్షణ శాఖకు షిప్‌యార్డు బదిలీ అయ్యింది. 177 నౌకలను నిర్మించగా 2 వేల నౌకల రిపేర్లను షిప్‌యార్డు ఈ 75 ఏళ్లలో చేపట్టి మంచి గుర్తింపును తెచ్చుకుంది. ఎంత ఖ్యాతి గడించినా సరే సరైన ఆర్డర్లు లేకపోవడంతో ఇంత పెద్ద భారీ నౌకా నిర్మాణ పరిశ్రమ ఖాయిలా పడిన సంస్థగా మారిపోయింది. గతంలో 10 వేల మంది వరకూ పర్మినెంట్ సిబ్బంది, ఉద్యోగులు పనిచేసేవారు. తాజాగా ఉద్యోగులు స్టాఫ్ అండ్ వర్క్‌మెన్ (అధికారులతో సహా) 1100 మంది వరకూ ఉండగా ఎల్ అండ్ ఎం సిరీస్‌లో 3372 మంది కార్మికులు పనిచేస్తున్నారు.

ఎఫ్‌ఎస్‌ఎస్‌లతో ఆర్థిక పరిపుష్టి

తాజాగా ఎఫ్‌ఎస్‌ఎస్‌ల ఆర్డర్‌గనక ఆచరణ రూపం దాల్చితే దీర్ఘకాలంలో షిప్‌యార్డు నిలదొక్కుకోవడానికి వీలుంది. వచ్చే 12 ఏళ్లకు సరిపడా లాభాలు, ఆర్థిక పరిపుష్టి ఈ రూ.25 వేల కోట్ల 5 ఎఫ్‌ఎస్‌ఎస్‌లతోనే సాధ్యమని, ఈ ఏడాది మార్చిలోగా ఆర్డర్లు ఫైనల్ కానున్నాయని షిప్‌యార్డు ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా, ప్రతి సంవత్సరం షిప్‌యార్డుకు లాభాలొస్తున్నప్పటికీ ఫ్రెష్ ఫైనాన్షియల్ రీస్ట్రక్చర్ పెండింగ్‌లో ఉంది. అంటే షిప్‌యార్డు పరిభాషలో నెగెటివ్ నెట్‌వర్క్‌లో షిప్‌యార్డు కొనసాగుతోంది. ఇలా సుమారు రూ.1000 కోట్ల మేర వడ్డీలు, పాత అప్పుల రూపంలో చూపిస్తున్నారు. ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్) తక్షణ ఆదాయార్జన కోసం డ్రై డాక్‌లో రిపేర్‌లు, మిగతా 2లో..



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

జగనన్న కాలనీల పనులు వేగవంతం

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం విఎంఆర్‌డిఎ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ రాజాబాబు, జెడ్సీలు, హౌసింగ్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ వారీగా ఇళ్ల మంజూరు, కొత్త నిర్మాణ ప్రతిపాదనలు, మొత్తం గ్రౌండింగ్ చేసిన ఇళ్లు, ఇసుక డిపోలు, విఎంఆర్‌డిఎ చేపడుతున్న మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు - పేదలందరికీ ఇంటి నిర్మాణం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో విశాఖ జిల్లా కోర్టు కేసుల కారణంగా ఇళ్ల నిర్మాణంలో వెనుకబడి ఉందని, రెట్టింపు వేగంతో అధికారులు పనిచేయాలని అన్నారు. సొంత ఇల్లు లేని వారికి ప్రభుత్వం అందించిన స్థలాల్లో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రారంభం కాని ఇళ్లని వెంటనే మొదలు పెట్టాలన్నారు. బిలో బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న గృహాలన్నింటినీ బేస్‌మెంట్ స్థాయికి తీసుకు రావాలన్నారు. బేస్‌మెంట్ లెవెల్ మిగతా 2లో..

'హైడ్రో' ప్రతిపాదనలు విరమించుకోవాలి : సిపిఎం

▶ వార్త మెయిన్‌లో..

చలపతిరావుకు కన్నీటి వీడ్కోలు

▶ వార్త 2లో..

పోరాటాలతో 'ఉక్కు'ను కాపాడుకుంటాం

▶ వార్త 2లో..

లెక్క తేలింది

- మాండూస్‌కు 268 ఎకరాల్లో దెబ్బతిన్న వరి
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

గత నెలలో మాండూస్ తుపానుకు నష్టపోయిన వరి రైతుల సంఖ్య తేలిపోయింది. నీటమునిగిన కోసిన పంటకు పరిహారం వర్తించదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. నీట మునిగిన వరితో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ధాన్యం రంగు మారింది. చేను కుళ్లిపోవడంతో పశువులకు గడ్డి లేకుండా పోయింది. కోసిన పంట తడిసిన పంట నష్టానికి పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తించని విధంగా ప్రభుత్వ నిబంధనలున్నాయి. ఎకరాకు రూ.20 వేలకుపైగా పెట్టుబడులు పెట్టిన రైతులు.. చేతికొచ్చే పంట పెట్టుబడులకు కూడా సరిపోదని అంటున్నారు. కౌలు రైతులకు ఈ నష్టం ఎక్కువుగా వుంది. పంట పెట్టుబడులకు తోడు కౌలు చెల్లించాల్సి రావడంతో సొంతభూమి కలిగిన రైతులు కంటే కౌలు రైతుకు ఎక్కువ నష్టం జరిగింది. పంట కోసిన తరువాత తుపానుకు తడిసిన వరిపంట దాదాపు మిగతా 2లో..

'దక్షిణం'లో 1373 పింఛన్లకు మంగళం..?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నిరుపేదలు అధికంగా ఉండే దక్షిణ నియోజకవర్గంలో ప్రభుత్వం ఒకేసారి 1373 పింఛన్ల రద్దుకు సన్నాహాలు చేస్తోంది. నిరుపేద వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇస్తున్న పింఛన్లను రద్దు చేస్తున్నట్లు పేర్కొని 1373 మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. దక్షిణ నియోజకవర్గంలో 15,568 మంది పింఛన్లు పొందుతున్నారు. వీరందరికీ డిసెంబర్ నెల వరకు సజావుగా పింఛను అందింది. ఈ ఏడాది జనవరి నుంచి అదనంగా రూ.250 పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారులంతా హర్షం వ్యక్తపరిచారు. అయితే వీరిలో 1373 మందికి పింఛన్లు రద్దు చేస్తూ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో వీరంతా ఒక్కసారిగా తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇక్కడ అనేకమంది పింఛన్ సొమ్ముతో జీవనం సాగిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అర్హత ఉండి పింఛన్ కోల్పోయిన నిరుపేదలతో కలిసి ఇటీవల సిఐటియు జగదాంబ జోన్ కమిటీ నాయకులు జివిఎంసి జోన్ 4 కార్యాలయం వద్ద నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నోటీసులు ఇచ్చినంత మాత్రాన పింఛన్ రద్దు అయినట్లు కాదని జివిఎంసి జోన్ 4 కమిషనర్ చక్రవర్తి అన్నారు. 1000 గజాల స్థలం, నాలుగు చక్రాల మోటారు వాహనం కలిగి ఉన్నా, నెలకు 300 యూనిట్లు దాటి విద్యుత్



పింఛన్ రద్దు నోటీసులు అందుకున్న లబ్ధిదారులు (ఫైల్ ఫొటో)

వినియోగిస్తున్నా, ఆదాయ పన్ను చెల్లిస్తున్నా.. అటువంటి వారికి పింఛన్లు రద్దు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ నిబంధనలు వర్తించే పింఛన్‌దారులను గుర్తించి నోటీసులు ఇచ్చామన్నారు. నోటీసులకు వారు ఇచ్చే సమాధానం సరిచూసి, అర్హత ఉంటే అటువంటి వారికి తిరిగి పింఛన్ ఇవ్వనున్నట్టు తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో 1373 మందికి నోటీసులు ఇచ్చినప్పటికీ.. జనవరి నెల నుంచి కొత్తగా 849 మందికి పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రద్దు కాపాడిన పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు దాదాపు దశాబ్ద కాలం నుంచీ పింఛన్ పొందుతున్న వారు కావడం గమనార్హం.

రైల్వే డిఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి సోమవారం విశాఖపట్నం స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రత, ప్రయాణికుల రద్దీ, కోచ్ మెయింటినెన్స్, నెలకొన్న సమస్యలు, భద్రత సంబంధిత సమస్యలపై దృష్టి సారించి ప్రయాణికుల నుంచి ఫస్ట్ హ్యాండ్ ఫీడ్‌బ్యాక్ పొందారు. అనంతరం జనరల్ బుకింగ్ ఆఫీస్, వెయిటింగ్ హాల్స్, ఎసి రిలాక్సింగ్ లాంజ్, ఫుడ్‌కోర్టులు, వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్, ఏటికొప్పాక స్టాల్ మొదలైనవాటిని తనిఖీ చేశారు. దుకాణదారులతో మాట్లాడారు. వెయిటింగ్ హాల్స్‌లో ఉన్న ప్రయాణికులతో మాట్లాడి, వారి ఫిర్యాదులను స్వీకరించారు. రైలు, స్టేషన్‌లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను సక్రమంగా పారవేసేందుకు డస్ట్‌బిన్‌లను ఉపయోగించాలని, ఫుట్‌బోర్డ్ ప్రయాణం, టిక్కెట్ లేని ప్రయాణాలను నివారించాలని ప్రయాణికులకు సూచించారు. రైలు ప్రయాణంలో భద్రతా నిబంధనలను పాటించాలన్నారు. ఎటువంటి అసౌకర్యానికి గురైనా 139 నెంబరుకు తెలపాలన్నారు.

చలపతిరావుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బిజెపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ పివి.చలపతిరావుకు పార్టీ నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు సోమవారం కన్నీటి వీడ్కోలు పలికారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బిజెపి తొలి అధ్యక్షుడైన చలపతిరావు భౌతిక కాయంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పార్టీ పతాకాన్ని కప్పారు. అనంతరం నగరంలోని చలపతిరావు గృహం నుంచి కృష్ణా కాలేజీ జంక్షన్, ఎంవిపి డబుల్ రోడ్డు, బిజెపి కార్యాలయం, బీచ్ రోడ్, పెదవాల్తేరు, ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్టర్ ఆఫీస్ గేటు, దత్ ఐల్యాండ్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ జంక్షన్, ఉమెన్స్ కాలేజ్ రూట్, అంబేద్కర్ విగ్రహం, అల్లిపురం మెయిన్ రోడ్డు, కాన్వెంట్ జంక్షన్ మీదుగా చావుల మదుం వరకూ అంతిమయాత్ర సాగింది. శ్రద్ధాంజలి ఘటించిన వారిలో మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, ఎంపీ జివిఎల్.నరసింహారావు, విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు ఎం.రవీంద్ర, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సురేంద్ర మోహన్, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉన్నారు. తెలంగాణ, కర్నాటక తదితర ప్రాంతాలకు చెందిన బిజెపి నేతలు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా పలువురు సంతాప సందేశాలను పంపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించింది.



చలపతిరావు పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న హరిబాబు

నేటి నుంచి జర్నలిస్టుల స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్, విస్జా ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం నుంచి ఈ నెల 12 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యదర్శి దాడి రవి కుమార్, ఉపాధ్యక్షులు ఆర్.నాగరాజ్ పట్నాయక్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ విశాఖ స్పోర్ట్స్ జర్నలిస్టుల అసోసియేషన్ సౌజన్యంతో ఈ మెగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు నుంచి ఇండోర్ స్పోర్ట్స్, 5 నుంచి 12 వరకు క్రికెట్ మెగా పోటీలు ఉంటాయన్నారు. ఇండోర్‌కి సంబంధించి టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్, షటిల్, క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తుండగా క్రికెట్‌లో మొత్తం 11 జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు పోర్టు అవుట్ డోర్ మైదానంలో ఈ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. విస్జా అధ్యక్షులు ఉమా శంకర్‌బాబు, ఉపాధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు జట్ల వివరాలను ప్రకటించారు. కార్యక్రమంలో కోశాధికారి మూర్తి, నానాజీ, ఇరోతి ఈశ్వరరావు పాల్గొన్నారు.

పోరాటాలతో 'ఉక్కు'ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం) పోరాటాలతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం కాకుండా కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 690వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఆగ్రో ఫారెస్ట్, సేఫ్టీ, ఎస్ఎస్‌డి, ఎఫ్ఎండి విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నాయకులు జె.రామకృష్ణ, సిహెచ్.సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేయనున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ధ్యేయంగా కార్మికులు అకుంఠిత దీక్షతో చేస్తున్న ఈ పోరాటం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని తెలిపారు. యువత, ప్రజలు కూడా ఈ పోరాటంలో పాల్గొంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, మూర్తి, రాజు, రమేష్, చంద్రశేఖర్, సిహెచ్‌వి.సత్యనారాయణ, ఎం.గోవింద్, జి.రాజు, సాంబశివరావు, దేముడు, రిటైర్డ్ ఉద్యోగులు కూన వెంకటరావు, జి.సూరిబాబు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

బర్దన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిపిఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎబి.బర్దన్ ఏడో వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం విశాఖలోని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ బర్దన్ తన 15వ ఏట నుంచే వామపక్ష భావాలవైపు అకర్షితుడై నాగపూర్ విశ్వవిద్యాలయానికి ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకునిగా ఎన్నికయ్యారని తెలిపారు. న్యాయశాస్త్రం, ఆర్థిక శాస్త్రాలలో డిగ్రీ పొందిన ఆయన ఆ రోజుల్లోనే సిపిఐలో చేరి అనేక కార్మిక సంఘ పోరాటాల్లో పాల్గొని పలుసార్లు అరెస్టులు అయ్యారని తెలిపారు. నాలుగేళ్లపాటు జైలు జీవితం గడిపారన్నారు. మహారాష్ట్ర శాసనసభకు ఓసారి ఎన్నికయ్యారని తెలిపారు. 1991లో యుపిఎ సంకీర్ణ ప్రభుత్వంలో సిపిఐ చేరడానికి విశేష కృషి చేశారన్నారు. మూడు పర్యాయాలు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. పార్టీ పట్ల, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్ల నిబద్ధతతో, మంచి అవగాహనతో పనిచేసేవారని గుర్తు చేశారు. నేటి తరం నాయకులు, కార్యకర్తలు ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్‌కె.రెహమాన్, ఎం.మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

నగర మార్కెట్లోకి ఇన్నోవా హైక్రాస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇన్నోవా హైక్రాస్ ధరలను టయోటా కిర్లోస్కర్ మోటార్ సోమవారం వెల్లడించినట్టు నగరానికి చెందిన లీలా కృష్ణ టయోటా షోరూం నిర్వాహకులు తెలిపారు. టయోటా విడుదల చేసిన ఈ నూతన వాహనం రూ.18 లక్షలా 30 వేలు నుంచి రూ.28 లక్షలా 97 వేలు మధ్య లభిస్తుందని తెలిపారు. అన్ని గ్రేడ్‌లకూ భారతదేశ వ్యాప్తంగా ఒకే ధరలు వర్తిస్తాయని, ప్లాటినమ్ పెరల్ వైట్ కలర్‌కు అదనపు ప్రీమియం వర్తిస్తుందని టికెఎం సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ తెలిపారు.



ఇన్నోవా హైక్రాస్ వాహనం

మొదటి పేజీ తరువాయి..

షిప్‌యార్డుకు భారీ నౌక నిర్మాణాల ఆర్డర్..?

సబ్‌మెరైన్ రీ ఫిట్‌లు కూడా కంపెనీకి కీలకంగా ఉన్నాయి.

5 ఎఫ్ఎస్ఎస్‌ల ఆర్డర్ ఏ సంస్థతో అంటే..

హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ నౌకల నిర్మాణ విషయంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలు తొలుత హుండయ్‌తో కొన్నాళ్ల పాటు చర్చలు జరిపారు. తాజాగా అగ్రిమెంట్ మాత్రం టర్కీ దేశానికి చెందిన అనడోల్ షిప్‌యార్డుతో కుదుర్చుకున్నట్లు భోగట్టా.

జగనన్న కాలనీల పనులు వేగవంతం

అంతకన్నా ఎక్కువ స్థాయిలో ఉన్న గృహాలన్నింటినీ రూఫ్ క్యాస్టింగ్ స్థాయికి తీసుకురావాలన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టుకునే వాళ్లకు రూ.35 వేలు రుణం అందించాలన్నారు. ఎస్‌హెచ్‌జి రుణాల కోసం బ్యాంకు అకౌంట్లు తక్షణమే తెరవాలని ఆదేశించారు. అలాగే ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి స్టేజి అప్డేషన్ చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్‌లను లేఅవుట్లకు ఎప్పటికప్పుడు సరఫరా చేసేలా చూడాలని, సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణ ఏజెన్సీలు పక్కా ప్రణాళికతో పనులు చేసి సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

లెక్క తేలింది

ఏడు వేల ఎకరాలకు పైగా వుంటుందని అంచనా. ఈ విస్తీర్ణానికి ప్రభుత్వం నుంచి పైసా సాయం రైతుకు అందదు. వరి పంట కోయక ముందు వర్షాలకు దెబ్బతిన్న పంటలను ప్రభుత్వ సూచనల ప్రకారం వ్యవసాయశాఖాధికారులు గుర్తించారు. ఈ తరహా పంట నష్టం 268.77 ఎకరాల్లో జరిగినట్లు అధికారులు నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. 499 మంది రైతులకు చెందిన 268.77 ఎకరాల పంట నష్టం రూ.16.12 లక్షలు వుంటుందని నివేదికలో పేర్కొన్నారు.

జిల్లాలో కోసిన తరువాత తడిసిన వరిచేను ఏడు వేల ఎకరాలకు పైగా వుండగా, వర్షాలకు భయపడి కోసిన వెంటనే తడితో కుప్పలు వేసిన వరి చేను కూడా అంతకుమించి వుంటుంది. దీంట్లో కొంతభాగం కుళ్లినట్లు రైతులు వాపోతున్నారు. తడితో కుప్పలు వేసిన ధాన్యం రంగు మారిందని రైతులు చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జరిగిన నష్టాన్ని భర్తీచేసేలా రైతుకు ప్రభుత్వం భరోసా ఇవ్వాల్సిందిపోయి నిబంధనల పేరుతో నష్టపోయిన రైతును పట్టించుకోకపోవడం విచారకరం.

అంబులెన్స్ వితరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాత నగరంలోని 39వ వార్డు పరిధి శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థకు సిఎంఆర్ సంస్థ అంబులెన్స్‌ను సమకూర్చింది. సోమవారం జరిగిన కార్యక్రమంలో సిఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మట్టపల్లి చలమయ్య ట్రస్టు అధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు, శ్రీ వివేకానంద సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, సభ్యులు సత్తిబాబు, గజపతి స్వామి పాల్గొన్నారు.



క్రీడాకారులను సత్కరిస్తున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు డిఆర్ఎం సత్కారం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: కేరళలోని కొల్లాంలో జరిగిన 68వ సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారతీయ రైల్వేకు ప్రాతినిధ్యం వహించిన బ్యాడ్మింటన్ క్రీడాకారులను డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి సోమవారం సత్కరించారు. టోర్నీ ఫైనల్‌లో అద్భుతంగా ఆడి, తమిళనాడు జట్టును 39-38, 35-24 తేడాతో ఓడించి, ఎనిమిదోసారి జాతీయ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలుపుకున్న ఇండియన్ రైల్వేస్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు వెంగళరావు, గణేష్ బృంద సభ్యులపై ప్రశంసలు కురిపించి, సత్కరించారు.కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జనరల్ సెక్రటరీ రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ 'స్పందన'కు 22 ఫిర్యాదులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పోలీస్ కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన పోలీసు స్పందనకు 22 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్సి,ఎస్టి సెల్ ఎసిపి ఎస్.బాబూజీ పాల్గొని, ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని ఎసిపి బాపూజీ పరిశీలించగా, వీడియో కాన్ఫరెన్స్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడిన సిపి సిహెచ్.శ్రీకాంత్, వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులతో వెంటనే మాట్లాడి, చట్టపరంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజాశక్తి 3
మంగళవారం 3 జనవరి 2023



తహశీల్దార్‌కు ఫిర్యాదుచేస్తున్న మహంతి శ్రీనివాసరావు

డ్రెయినేజీలపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీలు పూడికతీతలపై పద్మనాభం తహశీల్దార్ లోకేశ్వరరావుకు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మహంతి శ్రీనివాసరావు సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుచేశారు. దీనిపై తహశీల్దార్ స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ శైలజ

వేములవలసలో ఫ్యామిలీ ఫిజిషియన్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు కోరాడ శైలజ, ఎఎన్ఎం ఉమ, సిహెచ్ఓ సూర్యకళ ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలందించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షయపాత్ర ఫౌండేషన్ అందిస్తున్న పౌష్టికాహారం బాగుందో లేదో డాక్టర్ శైలజ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ కోరాడ మంగలత, వైసిపి జిల్లా నాయకులు కోరాడ అప్పలస్వామి నాయుడు, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం స్వర్ణలత, టీచర్ సుభాషిణి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఢిల్లీలో ఈ నెల 4వ తేదీన జరుగనున్న అంతర్జాతీయ ఇంటర్ యూనివర్శిటీ తైక్వాండో పోటీలకు స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థి జె.హరినాథ్ ఎంపికయ్యాడు. డిసెంబర్ 5వ తేదీన ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన తైక్వాండో అంతర్జాతీయ ఎంపిక పోటీల్లో హరినాథ్ ఎంపికయ్యాడు. ఈ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.విద్యాసాగర్, డిపార్ట్‌మెంట్ హెచ్ఒడి రాజేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గౌరీశంకర్, పలువురు అధ్యాపకులు సోమవారం కళాశాలలో అభినందించారు.



విద్యార్థి హరినాథ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల

గీతంలో మహిళలకు ఫైజర్ 'పాట్' శిక్షణ

ప్రజాశక్తి-మధురవాడ: ఉత్తరాంధ్ర జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాలలో బాలికల అభ్యున్నతి కోసం ప్రపంచ ప్రఖ్యాత ఔషధ పరిశ్రమ ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా లిమిటెడ్ సంస్థ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కలిసి నిర్వహిస్తున్న ఫైజర్ అటానమస్ టీమ్స్ (పాట్) శిక్షణ కార్యక్రమాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సోమవారం ఫైజర్ సంస్థ విశాఖ అధిపతి విక్రమ్ శుక్లాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫైజర్ విశాఖ అధిపతి విక్రమ్ శుక్లా మాట్లాడుతూ, ఫార్మా రంగంలోకి మహిళలను ప్రోత్సహించడానికి సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని అందులో భాగంగా ఈ ఏడాది 120 మంది విద్యార్థినులను స్థానిక గ్రామాలకు వెళ్ళి స్వయంగా ఎంపిక చేసుకుని ఉద్యోగంతో పాటు గీతం ద్వారా మూడేళ్ళ డిగ్రీ కోర్సులో ఉచిత శిక్షణ అందించనున్నదని వెల్లడించారు. 2024 సంవత్సరంలో మరో 250 మంది గ్రామీణ బాలికలను ఈ శిక్షణకు ఎంపిక చేసుకునే ఆలోచనలో ఉన్నామన్నారు.

ఫైజర్ గ్లోబల్ సప్లై ఇండియా లిమిటెడ్ పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అధిపతి తీగల రవికిరణ్ మాట్లాడుతూ పాట్ మహిళలను నైపుణ్యాలతో, నాయకత్వ లక్షణాలతో తీర్చిదిద్దే సంపూర్ణ శిక్షణ కార్యక్రమం అని తెలిపారు. భవిష్యత్తులో ఈ శిక్షణను మరింత సమర్థవంతంగా రూపొందిస్తామన్నారు.

గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసారు. అకడమిక్ ప్రో- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ ఈ వారియర్ మాట్లాడుతూ, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోర్సులకు రూపకల్పన చేయడంలో గీతం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ మహిళా సాధికారితకు ఫైజర్ శిక్షణ వంటివి అవసరమన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎమ్.బాలకుమార్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా తాము కోర్సులు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. గీతం రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు, కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.మురళీధర్, ఫైజర్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అధిపతి బి.మురళీధరశర్మ, క్వాలిటీ విభాగాధిపతి కె.రవిచంద్ర, ఫైనాన్స్ విభాగం అధిపతి ఆర్.రాజేష్ పాల్గొన్నారు.

'అన్యాయంగా అరెస్టు చేస్తున్నారు..!'

ప్రజాశక్తి-సీతమ్మధార : తన కొడుకుని అన్యాయంగా అరెస్టు చేస్తున్నారని ఓ తల్లి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆవేదన వ్యక్తంచేసింది. రౌడీషీటర్ వేముల ఆనంద్ శంకరమఠం ప్రాంతంలో నివాసముంటున్నాడు. కొన్ని రోజుల క్రితం గంజాయి కేసులో ఆనంద్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. బెయిల్‌పై వచ్చి నెల రోజులు అయ్యేసరికి మళ్లీ గంజాయి కేసు పేరుతో తమ కొడుకుని అన్యాయంగా అరెస్ట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారునికి ప్రాణాపాయం ఉందని ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్టు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారని, అయితే ఇలా గంజాయి కేసు పేరుతో అరెస్టు చేసి రిమాండ్ తరలించడం ఎంతవరకు న్యాయమని పోలీసులను నిలదీశారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్ తరలిస్తామని పోలీసులు తెలిపారు.

జర్నలిజం విభాగాధిపతిగా వినయ్ కుమార్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతిగా డాక్టర్ సిఎం.వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ సోమవారం వినయ్‌కుమార్‌కు ఉత్తర్వులు అందించారు. అనంతరం ఆయన విభాగంలో బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్‌ను విభాగ ఆచార్యులు డివిఆర్ మూర్తి, సిహెచ్.రామకృష్ణ, టి.విజయలక్ష్మి అభినందించారు.



విసి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణమోహన్ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న వినయ్‌కుమార్

ఆలయాల నిర్మాణాలకు రూ.9 కోట్లు : పెట్ల



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 90 దేవాలయాల నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు అయినట్లు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేష్ తెలిపారు. సోమవారం గొలుగొండలో విలేకర్లతో మాట్లాడారు. నర్సీపట్నం మండలంలో 20, నాతవరంలో 28, గొలుగొండలో 20, మాకవరపాలెంలో 22 దేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుండి రూ.9కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. దీనికి సంబంధించి జిఒ ఆర్డర్‌ను విలేకర్లకు చూపించారు. ఒక్కొక్క దేవాలయంకు రూ.10లక్షలు చొప్పున మంజూరు అయ్యాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో వీటిని నిర్మాణం చేస్తామని చెప్పారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని ఎండపల్లి గ్రామంలో ఈనెల 2న ప్రజాశక్తిలో వచ్చిన కథానికి అధికారులు స్పందించారు. రోడ్లపైనే మురుగు నీరు పేరుత సోమవారం కథనం ప్రచురితమైంది. డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి, గ్రామీణ విస్తరణ అధికారి ప్రేమ్ కుమార్, సర్పంచ్ పావని సహ పలువురు అధికారులు గ్రామాన్ని సందర్శించి రోడ్లపై పారుతున్న మురుగు నీటిని పరిశీలించి ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. మురుగు నీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు సహ ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.



మురుగునీటిని పరిశీలిస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు

'సీ ఫుడ్స్'లో యువకుడు మృతి

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ పరిధిలోని నాగ హనుమాన్ సి ఫుడ్ కంపెనీలో 18 ఏళ్ల యువకుడు బిక్కీ ఎక్కో అనుమానస్పదంగా మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... నాగ హనుమాన్ సి ఫుడ్ కంపెనీలో బీహార్, ఆంధ్రకు చెందిన పలువురు పనులు చేస్తున్నారు. నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ఆదివారం రాత్రి కార్మికులు మద్యం తాగారు. ఈ నేపథ్యంలో బీహార్, ఆంధ్ర కార్మికుల మధ్య వివాదం తలెత్తి, కొట్లాటకు దారి తీసింది. కొట్లాటలో వ్యాయామం చేసే డంబుల్స్‌తో దాడులకు పాల్పడ్డారు. దీంతో బీహార్‌కి చెందిన బిక్కీ ఎక్కో తలపై బలమైన గాయమై రక్తస్రావం అయింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తగరపువలసలోని ఎన్నార్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బిక్కీ ఎక్కో మృతి చెందాడు. ఆనందపురం సిఐ రామచంద్ర ఆధ్వర్యాన కేసు దర్యాప్తు చేస్తున్నారు

ఆరుగురు జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -తగరపువలస : కోడి పందాలు నిర్వహిస్తున్న ఆరుగురు జూదరులను భీమిలి పోలీసులు సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ సమీపంలో గోస్తని ఒడ్డున కోడి పందాలు నిర్వహిస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు సిఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్ఐ జి హరీష్ సిబ్బందితో కలిసి నిఘా వేశారు. కోడి పందాలు నిర్వహిస్తుండగా ఆరుగురిని పట్టుకున్నారు. వారి నుంచి 4 కోడి పుంజులు, రూ.9,270 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టు బడిన ఆరుగురిని కోర్టుకు తరలించారు. సిఐ లక్ష్మణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేల బావిలో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ, గొల్లల తాళ్లవలసకు చెందిన కొంగరాని నరసింగరావు (60) ప్రమాదవశాత్తు నేల బావిలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నరసింగరావు ఆవును ఇంటి పెరట్లో కట్టేందుకు ఈ నెల 1వ తేదీ రాత్రి 8.30 గంటలకు వెళ్ళాడు. తండ్రి ఎంతకీ రాకపోవడంతో కుమారుడు వెతికేందుకు వెళ్లగా, నేల బావిలో బుడగలు రావడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, కొంత మంది స్థానికులు, పీపుల్ పవర్ సంస్థ సభ్యులు కలిసి బావిలో పడిన నరసింగరావును వెలికి తీశారు. అప్పటికే అతను మృతి చెందాడు. మృతిపై తమకు ఎటువంటి అనుమానమూ లేదని, ఈ సంఘటన ప్రమాద వశాత్తు జరిగినట్లుగా మృతుని భార్య మంగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జోగుంపేట విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగుంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ అండర్ 17ల జి.సాయికుమార్, బేస్ బాల్‌లో వి.గంగాధర్, అండర్ 14లో జి.నవరాజు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు వై.సరోజిని, పిడి బి.లోవరాజు అభినందించారు.

అచ్చెన్నను కలిసిన కోరాడ

ప్రజాశక్తి-భీమునిపట్నం : టిడిపి భీమిలి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఉన్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును సోమవారం కలిశారు. ఈ సందర్భంగా అచ్చెన్నకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందని కోరాడ వివరించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న కోరాడ

48వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కంచరపాలెం : జివిఎంసి 48వ వార్డులోని జైభారత్‌నగర్ సచివాలయ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో బిటి రోడ్డు, ఇందిరానగర్ -2, 3 ప్రాంతాల్లో రూ.20 లక్షలతో మెట్లు, కాలువలు, వీధి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి, కార్పొరేటర్ జి.కవిత అప్పారావు, డిఇ భరణికుమార్, ఎఇ అర్చన, కర్రి రామిరెడ్డి, శ్రీరామ్, హేమంత్, భూలోక, పి.అప్పారావు, డొప్ప శ్రీను, కనకమహేష్, జూన్సన్, జాగరపు అప్పారావు, భరత్ అప్పారావు, దుర్గాభవాని, జయంతి, వరలక్ష్మి, ప్రసాద్, భాస్కర్, రాజేష్, లోకేష్, నరేష్ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

47వ వార్డులో ఇళ్ల పట్టాలు పంపిణీ

జివిఎంసి 47వ వార్డు పరిధి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యాన రాంజీ ఎస్టేట్ సామాజిక భవనంలో సోమవారం ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వసంతల అప్పారావు, రాఘవులు, సుకుమార్, కోరిబిల్లి విజయ్, చందు, అనీల్, మొక్క రమణ, గురువోజి, వాసు సురేష్, నాగరాజు, రమేష్, భారత్, జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపనలో పాల్గొన్న కెకె.రాజు

ఉక్కు ప్రజాగర్జన 30వ తేదీకి వాయిదా

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 27వ తేదీన తలపెట్టిన ప్రజా గర్జన సభను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు. ఉక్కునగరంలోని ఏఐటియుసి కార్యాలయంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యుల అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించారు. ముందుగా పి.వి.చలపతిరావుకు సంతాపం తెలిపారు. అనంతరం సమావేశంలో సభ్యులు చర్చలు జరిపారు. ప్రజాగర్జనను మార్చునకు నిర్ణయించారు. ప్రతి కాలనీలో, విభాగాలలో దీని గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గర్జనకు 50 వేల మందికి తక్కువ కాకుండా ఉద్యోగ, కార్మిక, ప్రజల కుటుంబాలతో జనసమీకరణ చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ సమస్యలపై మంగళవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కలవాలని కమిటీ నిర్ణయించింది.

వర్క్స్ సిజిఎం చక్రవర్తికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సిజిఎం అభిజిత్ చక్రవర్తికి వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప ఆధ్వర్యాన నాయకులు సిజిఎంను కలిశారు. ఆయనచే యూనియన్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా మస్తానప్ప మాట్లాడుతూ, 2023 సంవత్సరములో విశాఖ ఉక్కు కర్మాగారం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను అధిగమించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, మార్పుపూడి పరదేశి, పిట్టారెడ్డి, దరిగి రవి, గెద్దాడ అప్పలరాజు, బోర శశిభూషణరావు, రామయ్య, కూరడా నరసింహమూర్తి, నల్ల శ్రీను, సత్యనారాయణ, బొడ్డ గోవిందు, బంధం అప్పలరాజు, వీరమల్లు ఉమాశంకర్, చంద్రశేఖర్ శకునాల, అప్పలరాజు పాల్గొన్నారు.


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైసిపి నాయకులు

వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలంనకు వైసిపి నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. సిసి రోడ్లు అభివృద్ధి చేయాలని, వీధిలైట్లు సమస్య పరిష్కరించాలని, కళింగ వీధిలో పార్క్ అభివృద్ధి చేయాలని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేయాలని కోరారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో దామోదర్, దానప్పలు, గోవిందరాజులు, ఈశ్వరరావు ఉన్నారు.


కాలువలను పరిశీలిస్తున్న ఎంఎహెచ్‌ఒ కిరణ్‌కుమార్

పాత గాజువాకలో ఎంఎహెచ్‌ఒ పర్యటన

ప్రజాశక్తి- గాజువాక : పాత గాజువాకలో సోమవారం ఎంఎహెచ్‌ఒ డాక్టర్ కిరణ్‌కుమార్ పర్యటించారు. గాజువాక జంక్షన్ కాలువలో పేరుకుపోయిన చెత్తను, రోడ్లపైకి వస్తున్న మురుగునీటిని పరిశీలించారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టారు.

ట్రాఫిక్ నిబంధనలపై ఛాయా చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి -తగరపువలస : ట్రాఫిక్ నిబంధనలపై స్థానిక జంక్షన్‌లో సోమవారం ఛాయా చిత్ర ప్రదర్శన నిర్వహించారు. వివిధ చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలు, అందుకు గల కారణాలను స్క్రీన్‌పై చూపుతూ అవగాహన కల్పించారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణం, హెల్మెట్ ధరించకుండా బైక్ నడపడం, మైనర్లు వాహనాలు నడపడం, ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం, కార్లలో సీట్ బెల్ట్ ధరించక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని పేర్కొంటూ ఛాయా చిత్ర ప్రదర్శన ద్వారా వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్‌కు ప్రొఎక్స్‌లెంట్ అవార్డు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఔరంగాబాద్‌లో ఇటీవల జరిగిన ఎన్‌సిక్యూసి-2022 (నేషనల్ కన్వెన్షన్ ఆఫ్ క్వాలిటీ కంట్రోల్) పోటీల్లో స్టీల్‌ప్లాంట్ ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగం ఉద్యోగులకు ప్రో ఎక్స్‌లెంట్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా విభాగం ఉద్యోగులు ఆర్.సత్యనారాయణ, ఎస్.ఎల్.ఎన్.రావు, సిహెచ్.రాంప్రసాద్, కెవి.రాజ్‌కుమార్, ఎస్‌వివి.ప్రసాద్‌ను విభాగాధిపతి వైవి.నాయుడు, అధికారులు సుబ్రహ్మణ్యం, బి.బాలాజీ, జెకె.శర్మ, పివి.నారాయణ, సతీష్, రాజు, భాషా, ప్రేమ్‌కుమార్ అభినందించారు. ప్లాంట్‌లో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో విభాగాధిపతి వైవి.నాయుడు మాట్లాడుతూ, విభాగం ఉద్యోగులు క్యూసి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చి అవార్డు సాధించడం గొప్ప విషయమన్నారు. ఐఎన్‌టియుసి స్టీల్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ, వేతన ఒప్పందంలో బోర్డు ఒప్పందం అయినట్లు కార్మిక వర్గాన్ని మభ్యపెట్టి ఎఐటియుసి మోసం చేసిందన్నారు. ఎటువంటి ఒప్పందం జరగలేదని సహ చట్టం ద్వారా నిరూపణ అయ్యిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారు రమణ, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, బిఎంకె.నాయక్, బిటి.జగదీష్, ఆకుల నూకరాజు, డి.మోహన్, మొల్లి ఈశ్వరరావు, రాథోడ్, కొమ్ము ప్రసాద్, గంగవరం గోపి, చిమ్మిటి అప్పలరాజు పాల్గొన్నారు.

11 నుంచి 'విజ్ఞాన్'లో యువతరంగ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విజ్ఞాన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ ఫర్ విమెన్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ సంయుక్తంగా యువతరంగ్ 2023 పేరుతో ఈ నెల 11, 12 తేదీలలో నేషనల్ లెవెల్ యూత్ ఫెస్టివల్ నిర్వహించటకు నిర్ణయించినట్లు కళాశాల రెక్టర్ డాక్టర్ వి మధుసూదనరావు తెలిపారు. సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఏటా 10 వేల మంది విద్యార్థులు వివిధ రాష్ట్రాలనుంచి పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డాన్స్, పోయెట్రీ, మెహిందీ, పలు క్రీడలు, పెయింటింగ్, మైక్రో ఆర్ట్, క్రాఫ్ట్, నెయిల్ ఆర్ట్, షార్ట్ ఫిలిం డ్రామా, స్కిట్, మైమ్ ఫ్లాష్ మాబ్, ఫోటోగ్రఫీ, దుబ్ స్మాష్ రాక్ బ్యాండ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.5 లక్షల వరకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. అనంతరం యువతరంగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ వైజాగ్ గ్రూప్ సిఇఒ ఎన్.శ్రీకాంత్, విఐపిటి ప్రిన్సిపల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, విఐఐటి ప్రిన్సిపల్ డాక్టర్ బి.అరుంధతి, విఐఇడబ్ల్యు డాక్టర్ జె.సుధాకర్, యువతరంగ్ కన్వీనర్ డాక్టర్



యూత్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న 'విజ్ఞాన్' ఉద్యోగులు, విద్యార్థులు

55వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డు పరిధి రెడ్డి తాటిచెట్లపాలెం, గవర తాటిచెట్లపాలెం, సంతోషిమాత ఆలయం వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కెవిఎన్ శశికళతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, కార్పొరేటర్లు కె.అనీల్ కుమార్ రాజు, ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు, యాత కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లి సుజాత, సమ్మెట్ల వెంకటేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 94వ వార్డు పరిధి అప్పలనరసయ్య కాలనీలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లతో పాటు పాత పెన్షన్లను కలిపి ఆయా లబ్ధిదారులకు వైసిపి నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు సోమవారం పంపిణీచేశారు. పెన్షనర్ల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సరికొత్త ఒరవడి సృష్టించారన్నారు. బడుగు బలహీన వర్గాలను అన్ని విధాలా ఆదుకుంటున్న జగనన్నకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కంచిపాటి జగదీష్, గోవింద్ పట్నాయక్, శ్రీనివాస్, అప్పారావు, శంకర్, సచివాలయ సిబ్బంది ఉదయ్ కుమార్, కల్పన, జయంతి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి 22వ వార్డులో కొత్తగా మంజూరైన 62 పింఛన్లను కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వార్డు సచివాలయ సిబ్బంది శశికళ, రెహమాన్, సంపత్ పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : 44వార్డు పరిధిలోని జివిఎంసి ఉర్దూ యుపి స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం ట్యాబ్‌లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నుంచి పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం తాపత్రయపడుతున్నారన్నారు. దీని కోసం విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టి.శాంతికుమారి, నాయకులు హిర, సోఫియా, గోపి, మంజుల, సీతారాములు, రామారావు, ఎం.రాంబాబు, బేగం పాల్గొన్నారు.

వాహన పత్రాల స్మార్ట్ కార్డులివ్వాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆటో, మోటార్ వాహనాల డ్రైవింగ్ లైసెన్సులు, సి బుక్కులు, ఆర్‌సిలకు స్మార్ట్ కార్డులను రవాణా శాఖ అధికారులు వెంటనే ఇవ్వాలని ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్‌చేశారు. స్మార్ట్ కార్డులు పేరుతో వాహనదారుల నుంచి రూ.200 చొప్పున వసూలు చేసి నెలలు గడుస్తున్నా డిఎల్ అండ్ ఆర్‌సి స్మార్ట్ కార్డులు ఇవ్వడం లేదని తెలిపారు. వాహనదారుడు వివరాలను ముద్రించేందుకు కార్డుకు కేవలం రూ.70 మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. వెంటనే స్మార్ట్ కార్డులు పంపిణీ చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -కంచరపాలెం : వేపగుంట పైడిమాంబ కాలనీలో నూతన సంవత్సరం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పెందుర్తి జోన్ అధ్యక్షులు వీరాచారి మాట్లాడుతూ, యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వంశీ, నితీష్‌ల స్మారకంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని, యాక్సిడెంట్ల పట్ల అవగాహనతో ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన 60 మందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాజు, తులసి, కాలనీ యువత పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో రాజు తదితరులు

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రచారం చేయాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లదేనని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం అనకాపల్లి అర్బన్ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ సారథులే రానున్న ఎన్నికల్లో రథసారథులన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కన్వీనర్ల వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆదేశించారన్నారు. ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు గృహ సారథుల నియామకం పూర్తి కావాలని కన్వీనర్లను కోరారు. పెన్షన్ల రద్దు చేశారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కొట్టి పారేశారు. అర్హత గల వారందరికీ సంక్షేమ పథకాలు తప్పక అందిస్తామని చెప్పారు. కొత్త పింఛన్లతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 44,51,750 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైసిపి నాయకులు పీలా రాంబాబు, కొణతాల భాస్కర్‌రావు, జాజుల రమేష్, పలక రవి, సూరిశెట్టి రమణ అప్పారావు, దాడి నారాయణరావు, ఆళ్ల నాగేశ్వరరావు, కోరుకొండ రాఘవ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం నారాయణరావు తదితరులు

బాక్సింగ్‌లో కెటివి.పాలెం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని కొత్త తలారివానిపాలెం మండల ప్రాథమిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న నందారావు జ్యోతి స్వరూప్ నర్సీపట్నంలో జరిగిన శాప్ లీగ్ బాక్సింగ్ సబ్ జూనియర్ విభాగంలో రజిత పతకం సాధించారు. సదరు విద్యార్థి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డి నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి జ్యోతి స్వరూప్‌ని సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం, శిక్షకులు డి.హరీష్, కె.అరుణ, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె ఉషాకుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వంట పాత్రలు అందజేస్తున్న ఎంఇఒ శ్రీనివాసరావు

బాలికల హైస్కూల్‌కు వంట పాత్రల వితరణ

ప్రజాశక్తి- చోడవరం : జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయులు ఇమ్మంది చంద్రాదిత్య, అట్టాడ రోహిత్, కలిదిండి శ్రీకాంత్, చిగురుపాటి మణితేజ, శృంగవరపు సత్యనారాయణ రూ.30 వేలు విలువైన వంట పాత్రలను సమకూర్చారు. వాటిని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు చేతుల మీదుగా సోమవారం అందించారు. పాఠశాల హెచ్‌ఎం బి.రవికళ ప్రేరణతో దాతలు ముందుకొచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ యూనియన్ నాయకులు మహాలక్ష్మి నాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుమారి సిఆర్‌పికెవిఎమ్.నాయుడు, రవిశంకర్, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు గూనూరు వరలక్ష్మి, బుచ్చిరాజమ్మ పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : యోగా, ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని విశ్రాంత సీబీఐ డైరెక్టర్ కార్తికేయ అన్నారు. మండలంలోని నాగులపల్లిలోనిచంద్రశేఖర మహా స్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు 30 నిమిషాల పాటు యోగ, ప్రాణాయామం, ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మంచి అలవాట్లతో పాటుగా థాంక్యూ, ప్లీజ్ అనే పదాలను వాడే విధంగా దిశా నిర్దేశం చేయాలన్నారు. ధ్యాన గురువు సుజాత, పలువురు యోగా గురువులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న ఎంవిఆర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కాణిపాకం శ్రీవినాయక ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం సోమవారం చేసుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ఆలయ లాంఛనాలు, మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుస్సాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఎంవిఆర్ పార్లమెంటరీ నియోజకవర్గ యువసేన సభ్యులు కడిమి వెంకట్, గంగిరెడ్ల సతీష్ ఉన్నారు.



ఎంవిఆర్‌కు ఫొటో అందజేస్తున్న అర్చకులు

నిబద్ధతగల అధికారి సీతామహాలక్ష్మి

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి



సీతామహాలక్ష్మిని సన్మానించిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి, ఉప కలెక్టర్ పని చేసిన నందూరి మహాలక్ష్మి నిబద్ధత గల అధికారి అని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. డిసెంబర్ 31న సీతామహాలక్ష్మి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం ఆమెను జిల్లా అధికారుల సంఘం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమయపాలన, చట్టాల పట్ల అవగాహన ఉన్న అధికారి సీతామహాలక్ష్మి అని ప్రశంసించారు. కలెక్టర్లతో తలలో నాలుకల వ్యవహరించి ఎన్నో సమస్యలను పరిష్కరించారన్నారు. సన్మానగ్రహీత సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ఏ శాఖలో పనిచేసినా సహోద్యోగులు, ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో తన సర్వీసు పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెసి కల్పనా కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ హేమంత్, డ్వామా పిడి సందీప్, డిహెచ్‌ఓ ప్రభాకర్ రావు, జిఎం డిఐసి శ్రీధర్, డిపిఓ శిరీష రాణి, డిఎల్‌డిఓ మంజుల వాణి, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు రామారావు, కార్యదర్శి లక్ష్మణరావు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జెసి, కలెక్టర్

స్పందనకు 110 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 110 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డిఆర్‌ఓ వెంకటరమణ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులో సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజు ఫేషియల్ అటెండెన్స్ అమలు చేయాలన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 25 అర్జీలు

స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 25 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల నుంచి నేరుగా ఎస్పీ గౌతమి శాలి అర్జీలను స్వీకరించారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటిపై అర్జీలను స్వీకరించారు. వీటిని చట్ట పరిధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

64వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎఒబి ఎనిమిది గ్రామాలకు చెందిన నిర్వాసితులు మండలంలోని వాడనర్సాపురం సమీపంలో నేవీ గేటు ముందు చేస్తున్న ఆందోళన సోమవారం నాటికి 64వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వాసిత జెఎసి పెద్ద మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలపై దృష్టి పెట్టిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. తమ బాధలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియడం లేదని, మండలం, జిల్లా అధికారులు కూడా తమ సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అంత వరకు నేవీ గేట్ లోపల నుంచి చేపల వేటకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే అనకాపల్లి, అమరావతి వరకు పాదయాత్ర చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

ఆశా వర్కర్ల నియామకాల్లో పాతవారికి అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - కె.కోటపాడు

ఆశా వర్కర్ల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తున్న నేపథ్యంలో గతంలో ఆశ వర్కర్లుగా పనిచేసి మానేసిన వారికి మళ్లీ అవకాశం కల్పించాలని సిఐటియు మండల కన్వీనర్ ఈర్ల నాయుడు బాబు కోరారు. మండల కేంద్రంలో సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది ఆశ వర్కర్లు అనారోగ్యం వలన, గత ప్రభుత్వ తప్పిదాల వలన బాధ్యతల నుంచి తప్పుకున్నారని, వారికి ఆశ వర్కర్ల విధులు బాధ్యతలపై పూర్తిస్థాయి అవగాహన ఉందని పేర్కొన్నారు. వారు గతంలో పనిచేసినప్పుడు మెరుగైన సేవలు అందించారని, ప్రస్తుతం వారు ఎటువంటి పనులు లేక ఖాళీగా ఉన్నందున వారి కుటుంబాల పోషణ ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. మళ్లీ వారికి ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గాడి ప్రసాదు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా చూడాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లి పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామసభ జరిగింది. గ్రామ అభివృద్ధి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనితీరు, శానిటేషన్, జగనన్న హౌసింగ్ పురోగతిపై చర్చించారు. అనంతరం సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అన్ని విధాల అందుబాటులో ఉండాలన్నారు. హౌసింగ్ నిర్మాణంలో లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్ది లబ్దిదారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా సీఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ నూకరాజు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

గొందుపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎపిఎస్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం, చౌడువాడ పీహెచ్‌సి ఆధ్వర్యంలో మండలంలోని గొందుపాలెంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టరు నిర్మల,104 డాక్టరు తారక్, ఎంపీహెచ్‌ఈఓ రాజశేఖర్ 140 మంది రోగులకు రక్త పరీక్షలు, వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రిసోర్సు పర్సన్ ఎస్.గోవిందరావు, సర్పంచ్ బండారు లక్ష్మణరావు, లింక్ వర్కర్ ఎ.త్రిమూర్తులు, దేవి, హెచ్‌వి, హెచ్‌విఎన్, ఎంఎల్‌హెచ్ పిహెచ్‌ఎన్, ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బ్యాగ్‌లు, మాస్క్‌ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ సమకూర్చిన జ్యూట్ బ్యాగులు, మాస్కులను ప్రముఖ సంఘ సేవకులు కర్రి సన్యాసి నాయుడు, కొణతాల పూర్ణచంద్రరావు చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రీన్ క్లబ్ పర్యావరణం పరిరక్షణ ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రీన్ క్లబ్ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు పెంటకోట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు వై సూరి అప్పారావు, గౌరవ సలహాదారు బీర వినోద్ కుమార్, కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-దేవరాపల్లి : చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి చెందిన క్లాప్ మిత్రులు (గ్రీన్ అంబాసిడర్లు) మూడు రోజుల నుంచి శ్రమిస్తూ దళితుల శ్మశాన వాటికను శుభ్రపరిచారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శ్మశానంలో పెరిగిపోయిన తుప్పలు, డొంకలను తొలగించారు. శ్మశాన వాటికను శుభ్రపరచడం పట్ల ఎస్సీ ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు, స్థానిక అంబేద్కర్ యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

భూములు కోల్పోయిన వారికి

ఎల్‌పిఒసిలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

వియంఆర్‌డిఏ భూ సమీకరణలో భూములు కోల్పోయిన పేద రైతు, కూలీలకు ప్రజలకు తక్షణమే ల్యాండ్ పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు (ఎల్‌పిఒసి), రెసిడెన్షియల్ ప్లాట్లు ఇవ్వాలని కోరుతూ సోమవారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో చేపట్టిన ఈ సమీకరణలో 6,116 ఎకరాల భూమిని పేదల నుంచి సమీక్షరించారని తెలిపారు. మూడేళ్లు అవుతున్న వారికి ఇంతవరకు ఎల్‌పిఒసి రెసిడెన్షియల్ ప్లాట్లు గాని, జీవనోపాధి గాని కల్పించలేదని చెప్పారు. గతంలో అమరావతిలో చంద్రబాబు, నేడు విశాఖలో జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలు ఒకటేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మామిడిపాలెం, పాపయ్య పాలెం, వెంకు పాలెం, సంపతి పురం, కూండ్రం గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న భూ సమీకరణ బాధితులు

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని పలు గ్రామాల్లో కొత్త పింఛన్లు పంపిణీ కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. అంతకపల్లిలో ఆ గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణ మూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ కొత్త పింఛన్లు అందజేశారు. బంగారమ్మ పాలెం గ్రామంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, ఎంపీటీసీ రాపేటి అరుణ రాము, వంగలిలో ఎంపీటీసీ గవర తులసి రాజు, కోటిని అమ్మతల్లి నాయుడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, సబ్బవరపు దేముడు బాబు, గొర్లి అప్పారావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని 35 గ్రామాల్లో వైయస్సార్ పెన్షన్ కానుకను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దొండ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కొలిమిశ్ళ శివ నాయుడు, నాయకులు దాకారపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడలో నూతనంగా మంజూరు చేసిన పింఛన్లను వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, వార్డు సుభ్యులు పైల హరీష్, పైల వెంకటరావు, పోతాల అప్పలనాయుడు, వర్రి లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, నిహారిక, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



పింఛను పంపిణీ చేస్తున్న బుచ్చయ్యపేట జెడ్‌పిటిసి రాంబాబు

కోటవురట్ల : సామాజిక పింఛన్లతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు జీవన భరోసా లభిస్తుందని కోటవురట్ల సర్పంచ్ అనిల్ కుమార్, నీలిగుంట సర్పంచ్ వరహాలబాబు తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల్లో పింఛన్లు 2,750ల ఎంపీడీవో చంద్రశేఖర్‌తో కలిసి అందజేశారు. ఎంపిటిసి పివి సూర్యారావు, గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గ్రామ కమిటీ అధ్యక్షులు సాయిబాబు పాల్గొన్నారు.

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు రూ.2,7,50లకు పెంచారని ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గొల్ల బాబురావు తెలిపారు. మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం పెరిగిన పింఛన్లు అందజేశారు. పాయకరావుపేట ఎన్నికల పరిశీలకుడు చింతలపూడి వెంకట్రామయ్య, ఎంపీపీ పార్వతి, జడ్పిటిసి లంక సూర్యనారాయణ, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు దనిశెట్టి బాబురావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుటూరు శ్రీనివాసరావు, జగతా శ్రీను, ఎంపీడీవో ఏఏ సాంబశివరావు, ఈవోపిఆర్‌డి సిహెచ్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మాటకు కట్టుబడి సిఎం రూ. 2750 పింఛను పెంచారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మండలంలోని కొత్త రేవుపోలవరం గ్రామంలో కొత్త పెన్షన్లు పంపిణి చేశారు. సర్పంచ్ మల్లె లోవరాజు, ఎంపిడివో రామచంద్రమూర్తి పాల్గొన్నారు.



పింఛను పంపిణీ చేస్తున్న పాయకరావుపేట ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదుగా పెంచిన పింఛన్‌లు పంపిణీ చేశారు. నియోజవర్గ పరిశీలకులు చింతలపూడి వెంకట రామయ్య, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పిటిసి కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నానాజీ, ఈశ్వరరావు, ఎంపీడీవో సీతారామరాజు, పిఓపిఆర్డి వెంకట నారాయణ పాల్గొన్నారు.

గొలుగొండ : రాజకీయాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ అన్నారు. సోమవారం గొలుగొండలో పింఛన్లను పంపిణీ చేపట్టారు. నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల బాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, మండల మహిళా ధ్యక్షురాలు లోచల సుజాత, మండల యూత్ అధ్యక్షులు రామకృష్ణనాయుడు, తహశీల్దార్ ఆనందరావు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందించిన అధికారులు

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెద్దపల్లిలో ఆక్రమణలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. "యథేచ్ఛగా ఆక్రమణలు" శీర్షికన డిసెంబర్ 31న ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. దీనికి యలమంచిలి మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి స్పందించి వాటిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారిని శ్రీలక్ష్మిని ఆదేశించారు. దీంతో సోమవారం మున్సిపాలిటీ, రెవెన్యూ సిబ్బంది 20, 21 వార్డుల్లోని పెద్దపల్లి, మంత్రిపాలెం పరిధిలో కబ్జాకు గురైన గ్రామకంఠం, చెరువు భూములను పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది సహాయంతో అక్రమంగా నిర్మించిన పందిళ్లను తొలగించారు. సర్వేనెంబర్ 285, 286లోని చెరువు భూమికి సంబంధించిన ఆక్రమణలపై ప్రజాశక్తి విలేకరి వివరణ కోరగా టౌన్ ప్లానింగ్ అధికారి చెరువు భూమికి సంబంధించిన వివరాలు రెవెన్యూ అధికారులకు లెటర్ పంపించినట్లు చెప్పుకొచ్చారు. మండల సర్వేయరు సర్వే చేసి రిపోర్ట్ వచ్చిన తర్వాత దానిని ఉన్నతాధికారులకు పంపిస్తామని, తుది నిర్ణయం ఉన్నతాధికారులు తీసుకుంటారని తెలిపారు.



గ్రామ కంఠం ఆక్రమించి కట్టిన పాకను తొలగిస్తున్న సిబ్బంది

'వైసిపి పాలనలో ప్రజలకు ఇబ్బందులు'



మాట్లాడుతున్న టిడిపి నాయకులు పివిజి.కుమార్

ప్రజాశక్తి- దేవరాపల్లి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని వాలాబు గిరిజన గ్రామంలో స్థానిక సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి బుజ్జి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిత్యవసర సరుకులు భారీగా పెంచి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా వారిని మోసం చేస్తుందని ఆరోపించారు. వాలాబు గిరిజన గ్రామంలో ఈ మూడున్నరేళ్లలో ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతల పాత్రునాయుడు, చల్లా నానాజీ, బండారు రామారావు, కర్రి నాయుడు, గుల్లిపల్లి అర్జున, పైలా యువసేన మండల అధ్యక్షుడు గర్రెడ్డి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుపై హత్యాయత్నం చేసిన..

జెడ్‌పిటిసి కుటుంబీకులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - చోడవరం

చెరుకు రైతుపై హత్యాయత్నం చేసిన చోడవరం జెడ్పిటిసి భర్త, కుమారుడిని తక్షణమే అరెస్టు చేయాలని సిపిఐ ఏరియా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంకుపాలెం గ్రామానికి చెందిన నాగులాపల్లి భూషణం అనే చెరకు రైతు టైర్ బండిపై చెరకు సుగర్ ఫ్యాక్టరీకి తోలుకెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక జెడ్పిటిసి భర్త మారిశెట్టి శ్రీకాంత్, వారి కుమారుడు అఖిల్ దాడి చేసి రైతును తీవ్రంగా గాయపర్చారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను వదిలిపెట్టారని పేర్కొన్నారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించాలని డిమాండ్ చేశారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు సోమవారం అచ్యుతాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి విజయకుమార్ జనసేన కండువాలను వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలన పట్ల ప్రజలు విసుగు చెంది ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మోటూరు శ్రీవేణి, షణ్ముఖ శ్రీనివాస్, చోడిపల్లి అప్పారావు, వడిసెల సన్యాసినాయుడు, బొందల శ్యామ్, అగ్గాల భాస్కర్‌రావు, పెదపాటి శివాజీ కృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గాంధీనగరం అన్నపూర్ణ వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, సంఘం అధ్యక్షులు పిడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వింటాకు రూ.2,040 మద్దతు ధర ఇస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు, మండల వ్యవసాయ అధికారి రంగాచారి, ఎంపీటీసీ పంచదార కన్నారావు, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, గణేష్, ఆత్మ ఏటీఎం రామకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు వెలగా భాస్కర నరసింహారావు, కొణతాల అర్జున్ నాయుడు పాల్గొన్నారు.

వాస్తవాల ప్రతిరూపం 'ప్రజాశక్తి'

ప్రజాశక్తి-కొత్తకోట:ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో దినదినాభివృద్ధి చెందుతున్న ప్రజాశక్తి దినపత్రిక మరింతంగా వృద్ధి చెందాలని రావికమతం జడ్పిటిసి, విశాఖ ఉమ్మడి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ చైర్ పర్సన్ తలారి రమణమ్మ తెలిపారు. సోమవారం కొత్తకోటలోని ఆమె స్వగృహంలో ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను మండల వైస్ ఎంపీపీ ఎం.భవానీ ప్రసాద్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ కోన లోవరాజు, పందల దేవ, ఎంపీటీసీ పూడి దేవ, వైసీపీ నాయకులు శీలం శంకర్రావు పలువురు వార్డు సభ్యుల సమక్షంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

రావికమతం :రావికమతం ఎంపీడీవో వెంకన్న బాబు ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు మాట్లాడుతూ, ఉన్నది ఉన్నట్లుగా వాస్తవాలను రాసే పత్రికగా ప్రజాశక్తికి మంచి గుర్తింపు పొందిందని ఆయన తెలిపారు. మీడియా ప్రభుత్వానికి, ప్రజలకు వారిదిగా పని చేస్తుందన్నారు.వాస్తవాలను వెలికి తీయడంలో పత్రికలు ముఖ్య పాత్ర వహించాలని సూచించారు. ప్రజలకు అండగా ఉంటూ ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పలు రకాల అభివృద్ధి పథకాలు, సమాజంలో జరుగుతున్న అనేక రకాల సమాచారాన్ని ప్రజలకు అందించడంలో మీడియా కీలకంగా వహిస్తుందని ఆయన తెలిపారు. ప్రజాశక్తి క్యాలెండర్ను ఆవిష్కరణ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి రమణయ్య, పలువురు పంచాయతీ కార్యదర్శులు, మండల కార్యాలయ, సచివాలయ సిబ్బంది, ప్రజాశక్తి పాత్రికేయులు వరహాలు పాల్గొన్నారు.

కశింకోట:ప్రజాశక్తి ముద్రించిన క్యాలెండర్‌ను మండలంలోని ఉగ్గిన పాలెం గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు సోమవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు వర్గాల అభ్యున్నతి కోసం ప్రజాశక్తి తన రాతలు రాస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బలిజి ముసలి నాయుడు, గాలి శ్రీనివాసరావు, శివబాబు పాల్గొన్నారు.



క్యాలండర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ

యుడిఎఫ్ కేలండర్, డైరీ ఆవిష్కరణ

అచ్యుతాపురం : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రూపొందించిన క్యాలెండర్, డైరీని వైసిపి సీనియర్ నాయకులు కోన బుజ్జి, ఎంపీడీవో విజయలక్ష్మి, సిఐ వై.మురళీధర్ రావు, ఎంఈఓ సిఆర్‌కె.దేవరాయలు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శి జివిస్ ప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.నూకరాజు, అధ్యక్షులు రవికుమార్, నాయకులు కె.సుభాషిణిదేవి, కె.కరుణకుమార్, పైడిరాజు, సువర్ణలత, మురళీకృష్ణ, సూర్యలక్ష్మి, రేఖ, సత్యనారాయణ, కుమారి, సలీం, శిరోమణి, లావణ్య, పివీఎస్ అప్పారావు, బి.సతీష్, పి.రామారావు, కె.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గొలుగొండ:నూతన సంవత్సరం సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణకు మండల యుటిఎఫ్ బృందం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గాయిత్రి, గొలుగొండ మండల గౌరవ అధ్యక్షులు ఎస్.స్వర్ణరాజు, మండల అధ్యక్షుడు కోడి రాజుబాబు, మండల ఉపాధ్యక్షులు చిట్ల అప్పారావు, కోశాధికారి గొంది ఈశ్వర్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న రఘునాథరావు

కెసిబి ఎటిఎం ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకు (కెసిబి) శాఖా ఎంటిఎంను నర్సీపట్నం సోమవారం బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షులు పరచూరు రఘునాథరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటిఎం ద్వారా ఖాతాదారులకు అన్ని వేళలా నగదు అందిస్తామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడమే కాకుండా బ్యాంక్ సేవలు అందుబాటులో ఉండే విధంగా ఆధునాతన, సాంకేతిక సౌకర్యాలను అందిస్తున్నామన్నారు. అన్ని బ్యాంకుల కార్డుల తమ ఏటిఎం నుంచి నగదును పొందవచ్చన్నారు. త్వరలో విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరులో బ్రాంచీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిఇఒ కె.శ్యామ్ కిశోర్, నర్సీపట్నం శాఖ మేనేజర్ పి.రాజేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న నేతలు

జగ్జీవన్ రామ్ విగ్రహానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో కైలాసపట్నం గ్రామంలో రాజగోపాలపురం వద్ద సోమవారం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేపట్టారు.స్థానిక ఉప సర్పంచ్ సిద్ధపత్తుల నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఈ పనులు చేపడుతున్నట్లు మాజీ జడ్పిటిసి వంతర వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో వంతర నాగేశ్వరరావు, వంజరపు కృష్ణ సహా పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లను ఇస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గొలుగొండ:సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. సోమవారం గొలుగొండ గురుకుల కళాశాలలో 8వ తరగతి చదువుతున్న 79 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థకు అనేక పథకాలు అమల్లోకి తెచ్చారన్నారు. నాడు నేడు, అమ్మఒడి, గోరుముద్ద వంటి పథకాలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపిపిలు జక్కు నాగమణి, సుర్ల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంరూరల్:మండలంలోని చెట్టుపల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులను ఎంపిపి సుర్ల రాజేశ్వరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఈ ట్యాబ్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇన్నం రత్నం, రమణ పాల్గొన్నారు.



ట్యాబ్‌లను ఇస్తున్న ఎంపిపి రాజేశ్వరి

ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు

ప్రజాశక్తి-యంత్రాంగం : ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని పలు దేవాలయాల్లో సోమవారం ఉత్తర ద్వార దర్శనాలు కల్పించారు. సింహాచలంలో దేవస్థానం వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబీకులు తొలి దర్శనం చేసుకున్నారు.

సింహాచలం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి సోమవారం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. దేవాలయ సంప్రదాయ ప్రకారం వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబానికి ఆలయ అర్చకులు, అధికారులు తొలిదర్శనాన్ని కల్పించారు. ఈ ఉత్సవంలో భాగంగా స్వామివారిని తెల్లవారుజామున సుప్రభాత సేవతో మేల్కొల్పారు. ధనుర్మాస ఉత్సవంలో భాగంగా గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు గోవిందరాజు స్వామి వారికి వైకుంఠ నారాయణ అలంకారం చేసి శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారిని శాసవాహనంపై అధిష్టింప చేసి ఉత్తర ద్వారానికి చేర్చి అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులకు తొలి దర్శనం కల్పించారు. స్వామిని దర్శించిన వారిలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, విజయనగరం ఆర్‌డిఒ సూర్యకళ, శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, పలువురు జడ్జిలు, అధికారులు ఉన్నారు.

భీమునిపట్నం : ముక్కోటి ఏకాదశి సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్నారు. ముత్తంశెట్టి సతీమణి జ్ఞానేశ్వరి, అవంతి విద్యా సంస్థల వైస్ చైర్మన్ శివ నందీష్, జివిఎంసి చీఫ్ విప్ లక్ష్మీ ప్రియాంక, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు

మధురవాడ : ఇస్కాన్ సాగర్‌నగర్‌లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సాంబదాస్ నితాయిసేవిని మాతాజీ సారథ్యంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలు కల్పించారు. జీవిఎంసీ 7వ వార్డు పరిధిలోని శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర ఆలయంలోనూ భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త సాయిలిల భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. 8వ వార్డు పరిధి గొల్లల ఎండాడలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు గంటలకే దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక దపపల్లా లే అవుట్ ప్రాంతానికి చెందిన ఎస్.సురేష్ బాబు, నీలిమ దంపతులు వెంకటేశ్వరస్వామికి వెండి ఆభరణాలు సమకూర్చారు. వార్డు కార్పొరేటర్ ఎల్.అప్పారావు పాల్గొన్నారు.


ఆనందపురం : మండలంలోని గంభీరంలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశాఖ ఉత్తర ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకుడు, వేములవలస పంచాయతీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం గంటా శ్రీనివాసరావు స్థానిక నాయకులతో భేటీ అయి రాజకీయాలపై ఆరా తీశారు. భీమిలి నియోజకవర్గంలో టిడిపి విజయం గంటా శ్రీనివాసరావుతోనే సాధ్యమని కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వానపల్లి ముత్యాలరావు, దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి 11వ వార్డు ఆరిలోవలోని టిఐసి పాయింట్ వద్దనున్న వెంకన్న స్వామిని, 20వ వార్డు పెదవాల్తేరులోని వెంకటేశ్వర స్వామిని, 23వ వార్డు మద్దిలపాలెంలోని వెంకటేశ్వర స్వామిని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమె వెంట కార్పొరేటర్లు గుడ్ల విజయసాయి, నెక్కల్ల లక్ష్మి ఉన్నారు.

మాకవరపాలెం:తామరంలోని వెంకటేశ్వర దేవాలయంలో భక్తులు నగర సంకీర్తనగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాకవరపాలెం రామాలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు చేశారు. పైడిపాల గిడుతురు, పీపీ అగ్రహారం తదితల గ్రామాల్లోని శివాలయాలు కిటకిటలాడాయి.

నక్కపల్లి :ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సుధూరు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు..ఆలయ ప్రాంగణం తెల్లవారి నుండి సాయంత్రం వరకు భక్తుల రద్దీతో కిటకటలాడింది. క్యూ లైన్‌లో భక్తులు బారులు తీరారు. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు వెంకన్న జ్ఞాపికను అందజేశారు.సాయంత్రం 8 వాహనాల్లో తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన నగర సంకీర్తన బృందం సోమవారం ఉదయం పాదయాత్ర చేసుకుంటూ ఉపమాక వెంకన్న ఆలయానికి చేరుకుంది.



పథకాల బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే

పేదలకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబురావు సోమవారం మండలం లోని రేవుపోలవరం గ్రామంలో పర్యటించారు. గ్రామ ప్రజలను కలుసుకుని వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, అందుతున్న తీరుపై గ్రామస్తుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించాలని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవుడు రాజు, మరిడియ్య, చేపల రాజు, శ్రీను, బాబ్జి, అప్పలరాజు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాణి రమాకుమారి దేవి మృతి

ప్రజాశక్తి-మాడుగుల:మాజీ ఎమ్మెల్యే, మాడుగుల సంస్థానా దీశురాలు రాణి రమాకుమారి దేవి (93) మృతి చెందారు. మాడుగుల సంస్థానాన్ని ఒడిశా రాజులు పరిపాలించగా లింగపూపతి దేవ్ కుమార్తెగా రాణి రమాకుమారి దేవి 1967లో మాడుగుల ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. ఆమె ఒడిశాలోని జైపూర్‌లో అనేక సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. కొద్ది సంవత్సరాల కిందట కుమారులు, కుమార్తె సైతం మృతి చెందగా ప్రస్తుతం కోడళ్ళు, మనమలు, మనుమరాలు విశాఖపట్నంలో నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి ఆమె జైపూర్‌లోని తన స్వగృహంలో ఆకస్మికంగా మరణించారు. అనేక సంవత్సరాలుగా మాడుగులతో సత్సంబంధాలతో ఆమె మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న డిపిఎం

మహిళలకు స్వయం ఉపాధి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మహిళల్లో ఆర్థిక స్వావలంభనకు ఉపాధి కల్పిస్తున్నట్లు డిపిఎం సంజయ్ బాబు తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను, రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. చిరుధాన్యాలతో స్నాక్స్, చేగోడీ వంటి అనేక రకాలైన తినుబండారాలను తయారు చేసుకోవాలన్నారు. తృణధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలకు ఎంతో డిమాండ్ ఉందని, అందుకే స్త్రీ నిధి రుణం ద్వారా ఒక్కొక్క సభ్యురాలకు రూ.40 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ కార్పొరేషన్ ప్రతినిధి సత్యనారాయణ, ఏపిఎం పార్వతి, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.


పింఛను అందజేస్తున్న సర్పంచ్ శివరాం

సర్పంచ్ శివరాం ఔదార్యం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో చినబొడ్డేపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు బంగారు నాగభూషణం గత కొంతకాలంగా శ్వాస కోశ వ్యాధితో బాధపడుతూ విశాఖలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయనకు పింఛను అందించేందుకుగాను సర్పంచ్ పైల శివరాం వాలంటీర్ దుర్గాప్రసాద్‌ను వెంట బెట్టుకొని స్వయంగా పెంచిన సామాజిక భద్రత పింఛను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పెంచిన పింఛన్‌తో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

గిరి విజ్ఞాన సంబరాల్లో ప్రతిభ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:ఐటీడీఏ ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించిన గిరి విజ్ఞాన సంబరాల్లో మండలంలోని కించుమండ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంగ్లీష్, గణితం సబ్జెక్టు అంశాలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించి పురస్కారాన్ని అందుకున్నారు. సహకరించిన ఉపాధ్యాయులు మండ్యాగురు శోభన్ బాబు, నాగభూషణం, రాంబాబులను హెచ్ఎం అభినందించారు.

హెటిరోపై హైకోర్టును ఆశ్రయిద్దాం

సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో డ్రగ్స్ కంపెనీతో మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులు, సమస్యలపై హైకోర్టును ఆశ్రయిద్దామని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. హెటిరో పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ ఆధ్వర్యంలో మత్స్యకార నాయకులు పిక్కి కామేశ్వరరావు, పిక్కి స్వామి, వాసిపిల్లి నూకరాజులతో పాటు పలువురు మత్స్యకారులు ఆయనకు హెటిరో కంపెనీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పైప్ లైన్ కు వ్యతిరేకంగా 397 రోజుల నుండి ఆందోళన చేస్తుంటే అధికార యంత్రాంగం, ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. కంపెనీ వ్యర్థ జలాలు శుద్ధి చేయకుండా సముద్రంలోకి, ఉప్పుటేరులోకి వదలడంతో మత్స్య సంపద నశించి మత్స్యకారులంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ కాలుష్యం కారణంగా క్యాన్సర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు తదితర రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు.క్యాన్సర్ బారిన పడి అనేకమంది మత్స్యకారులు మృత్యువాత పడ్డారని లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకు వెళ్లారు.అదేవిధంగా భూగర్భ జలాలు కూడా కాలుష్య బారిన పడ్డాయన్నారు. స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్న ప్పటికీ, హెటిరో కంపెనీలో అవేమీ పాటించ లేదన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు 397 రోజుల నుండి ఆందోళన చేస్తుంటే మత్స్యకారుల జీవితాలు సముద్రం పై ఎంతగా ఆధార పడ్డాయో అర్థమవు తుంద న్నారు. కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలోకి వదిలే ముందు ఈటిపి చేసి వదలాలన్నారు. వ్యర్థ జలాలు శుద్ధ చేసి వదులు తున్నారో లేదో అన్న విషయాన్ని పొల్యూషన్ శాఖ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాల్సి ఉందన్నారు. కంపెనీత మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని, దీన్ని ఎదుర్కొనేందుకు న్యాయపోరాటం చేద్దామన్నారు. కంపెనీ ఏర్పాటుకు ముందు నియమ నిబంధనలకు సంబంధించి ప్రభుత్వంతో తీసుకున్న అగ్రిమెంట్, సి ఎస్ఆర్ ఫండ్స్‌కు సంబంధించిన వివరాలు, స్థానికులకు కంపెనీ కల్పిస్తున్న ఉద్యోగాల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించాలన్నారు. వ్యర్థ జలాలు, మృతుల వివరాలు పూర్తిస్థాయిలో సేకరించి పూర్తి ఆధార పత్రాలను కోర్టుకు సమర్పించాలన్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.మత్స్యకారులు చేపట్టిన ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న మత్స్యకారుడు గోసల స్వామిని లక్ష్మీనారాయణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోసూరి శ్రీనివాస్, మత్స్యకార నాయకులు పిక్కి కోదండరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

15వ రోజుకు రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-పాడేరు:ఐటీడీఏ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 15వ రోజుకు చేరాయి. ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కే.త్రినాధరావు దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలన్నారు. దీక్షలకు సంపూర్ణంగా మద్దతిస్తున్నామని, ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వాములు అవుతామని వెల్లడించారు. ప్రభుత్వం స్పందించేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తెలిపారు. గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, తక్షణమే హెల్త్ అసిస్టెంట్‌లను ఆశ్రమాల్లో నియమించాలని కోరారు. గిరిజన ఆశ్రమ విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన ప్రజా ప్రతినిధులపై గౌరవం లేని పాడేరు ఐటీడీఏ పిఓను తక్షణమే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని, బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ. చిన్నారావు, టి.చిరంజీవి, పి.ప్రకాష్, బత్తిరి నరేష్, గిరిజన సంఘం నాయకులు రాందాస్ పాల్గొన్నారు.


దీక్ష చేపడుతున్న నాయకులు

సిసి రోడ్ల నిర్మాణాలకు చర్యలు

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక శారద నగర్ 16వ వార్డులో రూ.15 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మున్సిపల్ చైర్పర్సన్ ఆదిలక్ష్మిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, ఎంపీ సత్యవతి సుమారు రూ.70 లక్షల వరకు మంజూరు చేశారని, ఈ నేపద్యంలోనే సిసి రోడ్లన్నీ త్వరితగతిన నిర్మిస్తున్నట్లు తెలిపారు.మున్సిపాలిటీలో సిసి రోడ్లను పూర్తి చేస్తామన్నారు. మున్సిపాలిటీ సమస్యలను ఇటీవల నర్సీపట్నంలో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లామన్నారు. పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తున్నామన్నారు. రూ.500 కోట్లతో మెడికల్ కాలేజ్ నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజలు వైద్యం నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్యం పొందేలా మెడికల్ కాలేజీ నిర్మిస్తున్నామన్నారు. సుమారు 600 పడకల ఆసుపత్రి ఏర్పాటు అవుతుందన్నారు. రూరల్ ప్రాంతంలో గడపగడపకు కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. 35 సచివాలయాలకు గాను ఏడు కోట్ల వరకు నిధులు మంజూరు చేశామన్నారు. సంక్రాంతికి ప్రతి అక్కా చెల్లెలు సిసి రోడ్లుపైన ముగ్గులు వేసుకునే విధంగా రోడ్లు నిర్మిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే


పూడిక తీయిస్తున్న సర్పంచ్

కాలువల్లో పూడిక తొలగింపు

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో తట్ట బంద గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో పూడికపోయిన మట్టిని తొలగించామని సర్పంచ్ గోకివాడ రమణ తెలిపారు. హరిజన కాలనీ జంక్షన్ వరకు సుమారు 350 మీటర్ల కాలువలో ఉన్న మట్టిని పూర్తిగా తొలగించామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. ప్రజలకు ఇబ్బంది లేకుండా మురుగునీటి కాలువలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.


నగదు ఇస్తున్న నేతలు

రూ.5 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో జెడ్ గంగవరం పంచాయతీ టిడిపి కార్యకర్త పారిపల్లి అప్పలనాయుడు కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. పారిపల్లి అప్పలనాయుడు తల్లి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబం సభ్యులకు స్థానిక సర్పంచ్ దుంగల వెంకటరమణ, కచ్చాల అప్పలనాయుడు, పైల శ్రీనులు నగదును అందజేశారు.